# రాహుల్ పర్యటనలో పోలీసుల ఓవరాక్షన్

- నేషనల్ మీడియా, పోలీసుల మధ్య తోపులాట
- కర్ర పట్టి బెదిరింపులకు దిగిన సీఆర్‌పీఎఫ్ జవాను

వెంకటాపురం(ఎం): రాహుల్‌గాంధీ రామప్ప పర్యటనలో పోలీసులు అత్యుత్సాహం కనబరిచారు. రాహుల్‌గాంధీ రామప్ప ఆలయ సందర్శన నేపథ్యంలో గంట ముందే పబ్లిక్‌తో పాటు మీడియాను ఆలయ పరిసరాల నుంచి పంపించేశారు. రాహుల్ పర్యటనకు స్వయంగా పోలీసు ఉన్నతాధికారుల సంతకాలతో కూడిన పాస్‌లు మీడియా ప్రతినిధులకు ఇచ్చినప్పటికీ ఆలయ పరిసరాల్లోకి ఎలాంటి అనుమతి లేదని, ఏమైనా ఉంటే రామాంజాపూర్ సభ వద్దకు వెళ్లాలని మీడియాకు సూచించారు. అలాగైతే రాహుల్‌గాంధీ రామప్ప పర్యటన కవర్ చేయడం ఇబ్బంది అవుతుందని మీడియా ప్రతినిధులు చెప్పినా పోలీసులు లెక్కచేయలేదు. రాహుల్‌గాంధీ రామప్ప ఆలయానికి చేరుకుంటున్న క్రమంలో నేషనల్ మీడియా ప్రతినిధులు, వీడియో గ్రాఫర్లు రామప్ప ప్రధాన గేటు వద్దకు చేరుకున్నారు. దీంతో అక్కడ ఉన్న పోలీసులు వారిని అడ్డుకోగా నేషనల్ మీడియా ప్రతినిధులు, పోలీసుల మధ్య తోపులాట జరిగింది. బారికేడ్లను పక్కకు నెట్టి నేషనల్ మీడియా ఆలయంలో వెళ్లినప్పటికీ స్థానిక మీడియా ప్రతినిధులను, ఫొటో, వీడియో గ్రాఫర్లను పోలీసులు అనుమతించలేదు.


బలరాంనాయక్‌ను అడ్డుకుంటున్న పోలీసులు

**కర్ర పట్టి బెదిరింపులు**

రాహుల్‌గాంధీ రామప్ప ఆలయంలో పూజలు చేసి తిరిగి వస్తున్న సమయంలో రామప్ప ప్రధాన గేటు బయట ఉండి ఫొటోలు తీస్తున్న మీడియా ప్రతినిధులను సీఆర్‌పీఎఫ్ జవాను కర్రపెట్టి బెదిరించాడు. మీడియా అని చెప్పినప్పటికీ ఫొటోలు తీస్తే కొడతా అంటూ కర్ర చూపెడుతూ బెదిరించాడు. దీంతో మీడియా ప్రతినిధులు అసహనానికి గురయ్యారు. మీడియా ప్రతినిధులను ఇబ్బందులకు గురిచేసిన సీఆర్‌పీఎఫ్ జవానుపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని మీడియా ప్రతినిధులు కోరుతున్నారు.

**కేంద్ర మాజీ మంత్రి బలరాం నాయక్ అడ్డగింత**


నేషనల్ మీడియా ప్రతినిధులను అడ్డుకుంటున్న పోలీసులు


కర్రతో మీడియా ప్రతినిధులను బెదిరిస్తున్న సీఆర్‌పీఎఫ్ జవాను

రాహుల్‌గాంధీ పర్యటన సందర్భంగా రామప్ప ఆలయంలోకి వెళ్తున్న మాజీ కేంద్రమంత్రి బలరాం నాయక్‌ను పోలీసులు అడ్డగించారు. చివరకు స్థానిక ఎమ్మెల్యే సీతక్క అక్కడకు చేరుకొని పోలీసులకు చెప్పగా బలరాంనాయక్‌ను ఆలయంలోకి పోలీసులు ఆహ్వానించారు.

# అమ్మవారికి ప్రత్యేక పూజలు


నర్సింహాసాగర్‌లో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు


వెంకటాపురం(కె)లో..


రాజుపేటలో లలితాదేవి అలంకరణలో..

వెంకటాపురం(కె): మండలంలో దేవినవరాత్రి ఉత్సవాలను ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. నవరాత్రి వేడుకల్లో నాలుగవ రోజు మండల కేంద్రంలోని దుర్గమ్మ గుడి సెంటర్‌లో అమ్మవారు గాయిత్రిదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవ మండపాల వద్ద పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో భక్తులు హాజరై అమ్మవారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

మంగపేట: మండలంలోని పలు గ్రామాల్లో దేవీ శరన్నవరాత్రి వేడుకలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. మండలంలోని ఉమాచంద్రశేఖరస్వామి ఆలయంలో ఉమాదేవి అమ్మవారు లలితాదేవిగా, రాజుపేట రావిచెట్లు సెంటర్లో అన్నపూర్ణాదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చింది. తిమ్మంపేట, కమలాపురం, మల్లూరు, నర్సింహాసాగర్, చెరుపల్లి, రమణక్కపేట తదితర గ్రామాల్లో దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన అమ్మవారిని భకులు దర్శించుకుని భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

# కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

కన్నాయిగూడెం: బీఆర్‌ఎస్ పార్టీ గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని మూడు మండలాల ఎన్నికల ఇన్‌చార్జ్ మెట్టు శ్రీనివాస్ అన్నారు. మండలంలోని లక్ష్మీపురంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సుబ్బుల సమ్మయ్య అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. కార్యకర్తలు రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం శక్తివంచన లేకుండా పని చేసి గెలిపించుకోవాలన్నారు. రాష్ట్రంలో మూడో సారి బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కన్నాయిగూడెం మండలంలో భారి మెజారిటీ తీసుకురావాలని కార్యకర్తలకు దిశనిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు బంధు అధ్యక్షుడు పల్లా బుచ్చయ్య, సీనియర్ నాయకులు కావిరి చిన్నికృష్ణ, పూజారి కిషోర్, మఠం వెంకటేశ్వర్లు, పూజారి సత్యనారాయణ, చిలుముల రాంబాబు, కావిరి సంతోష్, భిక్షపతి, ఆలం రాంబాబు, సర్పంచ్ కొట్టి ఉమామహేశ్వరి, సుధాకర్, వెంకటయ్య, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మెట్టు శ్రీనివాస్

# పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి

మంగపేట: పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు ఇబ్బంది పడకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని మండల స్పెషలాఫీసర్ తుల రవి అన్నారు. మండలంలోని పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాల కల్పనపై పంచాయతీ కార్యదర్శులతో తుల రవి ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబర్ 30 న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఉండే విధంగా తాగునీరు, మూత్రశాలలు, మరుగుదొడ్లు, కరెంటు, ర్యాంపు, ఓటర్లకు నీడ ఉండే విధంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. అన్ని గ్రామ పంచాయతీలలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనులు చేపట్టాలని సూచించారు. ప్రతి గ్రామ పంచాయతీలో నర్సరీలో 5000 మొక్కలు పెంచే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. సైడ్ డ్రైనేజీల చివర్లో మురుగు నీరు బయటకు వెళ్లకుండా కమ్యునిటీ సోక్‌పిట్స్ ఏర్పాటు చేయాన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బైరి వీరస్వామి, ఎంపీడీఓ కర్నాటి శ్రీధర్, డిప్యూటీ తహసీల్దార్ మల్లేశ్వర్‌రావు, ఎంపీఓ మమత, ఈజీఎస్ ఏపీఓ మమత తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న అధికారులు

## ధర్మసమాజ్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా శ్రీనివాస్



కాటారం: ధర్మసమాజ్ పార్టీ(డీఎస్‌పీ) పార్టీ మంథని నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా కాటారం మండలం కొత్తపల్లికి చెందిన చిట్యాల శ్రీనివాస్ పేరు ఖరారైంది. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహారాజ్ మంథని ఎమ్మెల్యే అభ్యర్థిగా శ్రీనివాస్‌ను బుధవారం ప్రకటించారు. ఈ సందర్భంగా చిట్యాల శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో జరగబోయే శాసనసభ ఎన్నికలకు సంబంధించి పార్టీ అభ్యర్థుల ఎంపిక మొదటి జాబితాలో తనకు అవకాశం కల్పించిన విశారధన్‌మహారజ్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ప్రకటించారు. రానున్న ఎన్నికల్లో మంథని ప్రాంత ప్రజలు టార్చ్‌లైట్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

# సబ్ సెంటర్ల పరిశీలన


సబ్ సెంటర్‌ను పరిశీలిస్తున్న వైద్యాధికారి

వెంకటాపురం(కె): మండల పరిధిలోని మరికాల, రంగరాజాపురం, వెంకటాపురం సబ్ సెంటర్లను ఇమ్యూనైజేషన్ డే సందర్భంగా ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ బుధవారం పరిశీలించారు. సబ్ సెంటర్లలోని రికార్డులను పరిశీలించారు. కేసీఆర్ కిట్ పోర్టల్‌లో లబ్ధిదారుల డేటాలను ఎంటర్ చేయాలని ఏఎన్ఎంలను ఆదేశించారు. అనంతరం ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

## బీఆర్‌ఎస్ మండల అధ్యక్షురాలిగా సౌజన్య


నియామక పత్రం అందజేస్తున్న పుట్ట మధు

కాటారం: బీఆర్‌ఎస్ మహిళా విభాగం మండల అధ్యక్షురాలిగా కాటారం మండల కేంద్రానికి చెందిన రత్న సౌజన్య నియమితులయ్యారు. బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్, పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధు బుధవారం నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామాల్లో పార్టీ అభివృద్ధికి కృషి చేయడంతో పాటు రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం శ్రమించాలని పుట్ట మధు సూచించారు. తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి సౌజన్య కృతజ్ఞతలు తెలిపారు. సౌజన్య నియామకంపై బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# ములుగు డివిజన్‌లోనే కొనసాగించాలి

ఎస్ఎస్ తాడ్వాయి: తాడ్వాయి మండలాన్ని ములుగు డివిజన్ డివిజన్‌లోనే కొనసాగించాలని యువ చైతన్య యూత్ అధ్యక్షుడు గడ్డం రాజ్‌కుమార్ కోరారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ తోట రవీందర్‌ను యూత్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. తాడ్వాయి మండలాన్ని ఏటూరునాగారంలో కాకుండా ములుగు డివిజన్‌లోనే కొనసాగించాలని కోరారు. అలాగే ఎన్నికల ప్రశాంతంగా, సజావుగా జరిగేలా చూడాలన్నారు. ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభాలను గురిచేయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. మండలంలో ఓటర్లకు అవగాహన కల్పించి ఓటు హక్కుపై చైతన్యం తీసుకురావాలన్నారు. అలాగే ఈ కార్యక్రమంలో యువ చైతన్య యూత్ ఉపాధ్యక్షుడు పాహితి బ్రహ్మచారి, నాయకులు లింగాచారి, కృష్ణాచారితో పాటు తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దార్‌ను సన్మానిస్తున్న నాయకులు

## చొక్కాల గ్రామస్తుల ఆందోళన

వెంకటాపురం(కె): మండల పరిధిలోని చొక్కాల గ్రామ సమీపంలో రోడ్డపై లారీలు, వాహనాలు పెద్ద సంఖ్యలో తిరుగుతండటంతో దుమ్ము లేస్తుందని దీంతో ఇబ్బందలు పడుతున్నామని రోడ్లు మరమ్మతులు చేయాలని కోరుతూ గ్రామస్తులు బుధవారం ఆందోళన చేశారు. రోడ్డపై వాహనాలు నిలిచి ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఆందోళన చేస్తున్న విషయం తెలుసుకున్న ఎస్సై అశోక్ సంఘటన ప్రాంతానికి చేరుకోని మాట్లాడి ఆందోళన విరమింప చేశారు.

# బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

మంగపేట: మండలంలోని వాగొడ్డుగూడెంనకు చెందిన గట్టిపల్లి రాజేష్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని శ్రీ రామకృష్ణ సేవా ట్రస్టు చైర్మన్ బాడిష నాగరమేష్ బుధవారం పరామర్శించి, రూ 5,000 నగదును ఆర్థిక సాయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు వైస్‌చైర్మన్ బాడిష నవీన్, సభ్యులు బాడిష ఆది, ఇందారపు రమేష్, మునిగల మహేష్, కొమరం నితిన్, శివాజీ, చౌళం బాబు గ్రామస్తులు కృష్ణమూర్తి, ఈశ్వరమ్మ, శ్రీను, అర్జున్, నాని, బాబు, వంశీ, వజీర్, రాంబాబుతో పాటు తదితరులు పాల్గొన్నారు.


నగదు అందజేస్తున్న ట్రస్టు చైర్మన్ రమేష్

# జీపీ కార్యాలయంలో ప్రైవేట్ వ్యాపారం

మంగపేట: మండలంలోని నర్సింహాసాగర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రైవేట్ వ్యక్తులు వైద్య పరీక్షల పేరుతో ఆయుర్వేదిక మందుల వ్యాపారం నిర్వహిస్తున్న విషయం వెలుగు చూసింది. నర్సింహాసాగర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం ఉదయం 06 గంటల నుంచి ఎమ్మార్సై స్కానింగ్ తీస్తారని, స్కానింగ్ తీయించుకునే వారు ఎలాంటి ఆహారం తీసుకోకుండా రావాలని స్కానింగ్ పీజు రూ.200, మెడిసిన్‌పై 50 శాతం రాయితీ ఉంటుందని ముందు రోజు వాట్సాప్ గ్రూపుల్లో ప్రచారం చేశారు. 4జీ మేగ్నటిక్ రెసోనెన్స్ ఎనలైజర్ పరికరం ద్వారా పూర్తి బాడీ స్కాన్ చేసి న్యూట్రీషియన్ లోపాలను తెలిచేస్తామని, గుండె రక్త కణాలు, జీర్ణవ్యవస్థ , కిడ్నీ, నేత్ర, ఊపరితిత్తులు తదితర 50కి పైగా వ్యాదులకు ఆయుర్వేదిక మందులు ఇస్తామంటు కరపత్రాలను సైతం పంచారు. దీంతో గ్రామంలోని నిరక్షరాస్యులు, వయసు పైబడి మోకాళ్లు, ఒంటి నొప్పులు, బీపీ తదితర సమస్యలు ఉన్న వారు క్యూకట్టారు. దీనిని ఆసరా చేసుకున్న నిర్వాహకులు అవసరమున్నా లేకున్నా మందులను అంటగట్టి సొమ్ము చేసుకున్నారు. ప్రభుత్వ కార్యాలయంలో ప్రైవేట్ వ్యక్తులు వైద్య పరీక్షలు, మందులు విక్రయించడంపై నిర్వాహకులను అడిగితే పరీక్షలు నిర్వహించడం, మందులు విక్రయించేందుకు తమకు అనుమతి ఉందని సంబంధిత అధికారుల నుంచి అనుమతి తీసుకున్నామని చెప్పడం గమనార్హం. విషయంపై సంబంధిత ఎంపీడీఓ శ్రీధర్‌ను వివరణ అడుగగా విషయంపై తనకు ఎలాంటి సమాచారం లేదని విషయాన్ని సంబంధిత పంచాయతీ కార్యదర్శిని అడిగి చర్యలు తీసుకుంటామన్నారు.


వైద్యపరీక్షల కోసం వచ్చిన గ్రామస్తులు

# ఘనంగా బతుకమ్మ సంబురాలు


వాజేడు: బతుకమ్మలతో వైద్యసిబ్బంది


చిట్యాల: బతుకమ్మలతో సువిద్య డిగ్రీ కళాశాల విద్యార్థులు

వాజేడు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో బుధవారం వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది బతుకమ్మ సంబురాలను నిర్వహించారు. వైద్యులు మధుకర్, మహేందర్ ఆధ్వర్యంలో ఆస్పత్రి ఆవరణలో బతుకమ్మలు ఆడారు. సిబ్బంది, ఆశ కార్యకర్తలు బతుకమ్మలను పేర్చి ఆట పాటలతో అలరించారు. అనంతరం గోదావరిలో బతుకమ్మలను వదిలారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ విజయ పాల్గొన్నారు.

చిట్యాల: మండల కేంద్రంలోని సువిద్య డిగ్రీ కళాశాలలో బతుకమ్మ సంబురాలను విద్యార్థులు బుధవారం ఘనంగా నిర్వహించుకున్నారు. సంప్రదాయకంగా పూలను తెచ్చి బతుకమ్మను పేర్చి ఆటలు ఆడుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కందికొండ రాజు, కళాశాల ఇన్‌చార్జ్ నోముల వేణు, అధ్యాపకుడు దూడపాక సంతోష్, నోముల ప్రీతం, లోకేందర్‌రెడ్డి, సాంబయ్య, రంజిత్, ఝాన్సీ, శ్రీవిద్య, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

మల్హర్: మండలంలోని తాడిచర్ల జూనియర్ కాలేజీలో బుధవారం జిల్లా నోడల్ అధికారి, ప్రిన్సిపాల్ దేవరాజు, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ సంబురాలను నిర్వహించారు. విద్యార్థులు రంగురంగుల పూలతో బతుకమ్మలు పేర్చి ఆటపాటలతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. దేవతలను పూలతో పూజిస్తారు, కానీ పూలనే దేవతలుగా పూజించే ఏకైక పండుగ బతుకమ్మ అన్నారు. ఎన్ఎస్ఎస్ అధికారి రవీందర్, అధ్యాపకులు ప్రవీణ్, నరేందర్, వెంకట్‌రెడ్డి, రవి, జయపాల్, ఉమామహేశ్వరి, సీనియర్ అసిస్టెంట్ రాములు,షబ్బీర్ పాల్గొన్నారు.


మల్హర్: తాడిచర్లలో..

# విద్యుదాఘాతంతో యువకుడి మృతి

మల్హర్: మండలంలోని ఎడ్లపల్లికి చెందిన పిట్టల రాహుల్(22) అనే యువకుడు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మూడు రోజుల కిందట తమ పత్తి చేను దగ్గరికి వెళ్లి వస్తానని వెళ్లిన రాహుల్ ఎంతకీ రాకపోవడంతో మంగళవారం కొయ్యూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేశారు. బుధవారం పొలం పనులకు వెళ్లిన కూలీలకు దుర్వాసన రావడంతో అటు వెళ్లి చూడగా శవం కనిపించింది. దీంతో వారు పోలీసులకు సమాచారం అందిచారు. అక్కడి పోలీసులు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి ఎడ్లపల్లికి చెందిన రాహుల్‌గా గుర్తించి కుటుంబ సభ్యులకు తెలిపారు. అక్కడికి చేరుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు ఓ రైతు పొలంలో పంట నష్టం చేస్తున్న అడవి పందుల కోసం విద్యుత్ వైర్లు వేసి ఉంచగా రాహుల్ చేతికి తగిలి మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో తమ కుటుంబానికి న్యాయం చేయాలని మంథని–కాటారం ప్రధాన రహదారిపైన ధర్నాకు దిగారు. కాటారం సీఐ రంజీత్‌రావు, ఎస్సై నరేష్‌లు చేరకొని నచ్చ చెప్పి ధర్నాను విరమింపజేశారు. తండ్రి మల్లేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. దీంతో ఎడ్లపల్లి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నారు. తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.


రాహుల్(ఫైల్)

## రాహుల్‌గాంధీ సభకు తరలిన నాయకులు



వెంకటాపురం(కె): జిల్లాలోని రామాంజపూర్ గ్రామంలో నిర్వహించిన రాహుల్‌గాంధీ బహిరంగ సభకు కాంగ్రెస్ మండల నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలి వెళ్లారు. మండల అధ్యక్షుడు సైయ్యద్ హుస్సైన్, జిల్లా నాయకుడు చిడెం మోహనరావు ఆధ్వర్యంలో వాహనాల్లో పెద్ద సంఖ్యలో వెళ్లారు. ఈ కార్యక్రమంలో నాయకులు మన్నెం సునీల్, ధనపనేని నాగరాజు, ఉప్పల హరి, ఎంపీటీసీ గార్లపాటి రవి తదితరులు ఉన్నారు.

## క్లుప్తంగా

### మండల అధ్యక్షుడిగా రాకేష్



ములుగు రూరల్: మల్లంపల్లి మండల దివ్యాంగుల మండల కమిటీ అధ్యక్షుడిగా నేరెళ్ల రాకేష్‌ను ఏకగ్రీవంగా నియమించారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన దివ్యాంగుల సమావేశంలో జిల్లా అధ్యక్షుడు పెద్ది బోయిన శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు.

### బీజేపీలో పలువురి చేరిక



ఏటూరునాగారం: మండల కేంద్రంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు గండేపల్లి సత్యం సమక్షంలో ములుగు మార్కెట్ మాజీ కమిటీ చైర్మన్ ప్రహ్లాద్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిని కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రహ్లాద్ మాట్లాడుతూ.. నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన పథకాలకు ఆకర్షితులై పలు పార్టీలకు చెందిన బీజేపీలో చేరుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిరికొండ బలరామ్, ఏనుగు రవీందర్‌రెడ్డి, వావిలాల జనార్దన్, మహేందర్, శ్రీనివాసరెడ్డి, చక్రి తదితరులు ఉన్నారు.

### బీఆర్‌ఎస్‌లోకి..



భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఒకటో వార్డు సెగ్గంపల్లి గ్రామం నుంచి పలువురు యువకులు మున్సిపాలిటీ చైర్ పర్సన్ సెగ్గం వెంకటరాణి సిద్దు ఆధ్వర్యంలో బుధవారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కొత్త హరిబాబు, పార్టీ అర్బన్ అధ్యక్షుడు కటకం జనార్దన్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### సమావేశం వాయిదా

పలిమెల: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మండల సర్వ సభ్య సమావేశం వాయిదా పడినట్లు ఎంపీడీఓ ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. ఎంపీపీ, ఎంపీటీసీ, కోఆప్షన్ సభ్యులు, సర్పంచులు, జెడ్పీటీసీ ఎవరూ కూడా సమావేశానికి హాజరు కాకపోవడం, కేవలం ఆయా శాఖ అధికారులు మాత్రమే సమావేశానికి హాజరుకావడంతో వాయిదా వేస్తున్నట్లు తీర్మానం చేశారు. మళ్లీ సమావేశం ఎప్పుడు నిర్వహించేది త్వరలో తెలపుతామని పేర్కొన్నారు.

### తపాలా సేవలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

కాటారం: తపాలా ద్వారా అందుతున్న సేవలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని తపాలశాఖ పెద్దపల్లి సూపరింటెండెంట్ పసునూరి ప్రభాకర్ సూచించారు. మండల కేంద్రంలోని తపాలా కార్యాలయంలో బుధవారం కాటారం , మహదేవపూర్ సబ్‌పోస్టాఫిస్ పరిధిలోని బీపీఎంలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తపాలా శాఖలో అందుబాటులో ఉన్న సుకన్య సమృద్ధి యోజన, బీమా పాలసీలు, ఆర్డీలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. తపాలా శాఖ సేవలను ప్రజలు వినియోగించుకునేలా ప్రచారం చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### ఆన్‌లైన్ చెల్లింపులపై అవగాహన



టేకుమట్ల: విద్యుత్ వినియోగదారులు విద్యుత్ బిల్లులను ఆన్‌లైన్‌లో చెల్లించుకోవచ్చునని విద్యుత్ ఏఈ మణిదీప్ అన్నారు. బుధవారం మండల కేంద్రంతో పాటు, మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ బిల్లుల ఆన్‌లైన్ చెల్లింపులపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ వినియోగదారులు విద్యుత్ బిల్లులను చెల్లించేందుకు టీఎస్ ఎన్‌పీడీసీఎల్ 2023లో డిజిటల్ చెల్లింపుల సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చిందని అన్నారు. బిల్ డెస్క్, పేటీఎం, టీ వ్యాలెట్, గూగుల్ పే, అమెజాన్ పే ద్వారా బిల్లులను చెల్లించవచ్చని అన్నారు. డిజిటల్ చెల్లింపుల అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ సబ్ ఇంజనీర్ కుమారస్వామి, భూపాలపల్లి సబ్ సబ్ ఇంజనీర్, లైన్‌మెన్ మేరుగు రమేష్, జూనియర్ లైన్‌మెన్ కొండాల్, అన్‌మెన్ డిస్ట్రీబ్యూషన్ కిరణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.